సాక్షి సిద్దిపేట

శనివారం : 6 : మే : 2023



ముగ్గురి ప్రాణం తీసిన ఓవర్‌టేక్

ఓవర్ టేక్ ముగ్గురి ప్రాణం తీయగా, మరో ఐదుగురిని గాయాల పాలు చేసింది. ఏడుపాయల వనదుర్గా మాతను దర్శించుకొని వస్తుండగా ప్రమాదం జరిగింది. 8లో



సరిహద్దులో రెండంచెల తనిఖీ

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాయి. 8లో

బదిలీ కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని కేజీబీవీల్లో ప్రత్యేక అధికారులు(ఎస్‌ఓ), బోధన సిబ్బంది, ఏఎన్‌ఎం, అకౌంటెంట్‌లుగా ఆయాచోట్ల విధులు నిర్వహిస్తున్న వారు వేరే ప్రాంతానికి బదిలీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈనెల 9లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్యమే మహాభాగ్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి

సిద్దిపేటకమాన్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం బాగుంటేనే అందరూ బాగుంటారని సీనియర్ సివిల్ జడ్జి మిలింది కామ్లే, జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి అన్నారు. సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడికేర్ ఆస్పత్రి సహకారంతో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. శిబిరంలో 300 మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు లక్ష్మీనారాయణ, బాబురావు, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఆనంద్‌రాజ్, వైద్యులు త్రివిక్రమ్, కిశోర్, రాజేశం, పర్శరాం, లయన్స్ క్లబ్ ప్రతినిధులు భాస్కర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాల్లోనే 'మద్దతు'



కొండపాకలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొండపాక, సిర్సనగండ్ల, మర్పడ్గ, అంకిరెడ్డిపల్లి, బందారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ ర్యాగల్ల సుగుణతో కలిసి ప్రారంభించారు. అకాల వర్షాలతో రంగు మారిన ధాన్యం కూడా కొంటామని తెలిపారు. ఏగ్రేడ్ ధర క్వింటాల్‌కు రూ.2,060, కామన్ గ్రేడ్ ధర రూ.2, 040 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు చిట్టి మాధురిరెడ్డి, గూడెపు లక్ష్మారెడ్డి, ఏమల్ల రజిత, బడేకోలు లావణ్య, గజ్వేల్లి రజిత, ఎంపీటీసీలు పత్తి ఆంజనేయులు, నందాల శ్రీనివాస్, డైరెక్టర్లు కృష్ణ, మల్లేశం, ఉపసర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ రాధాకిషన్‌రెడ్డి, లీడర్లు భూపతిరెడ్డి, చెంది మల్లికార్జున్, గోవర్ధన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రవీందర్, రేపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్న గణేశ్‌రెడ్డి



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ గంగిశెట్టి రాజేంద్రకుమార్ సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా గణేశ్‌రెడ్డిని నియమిస్తూ కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ ఆదేశాలు జారీచేశారు.

బజరంగ్ దళ్ నిషేదం సరికాదు



సిద్దిపేటలో రోడ్డుపైనే హనుమాన్ చాలీసాను పఠనం చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బజరంగ్ దళ్‌ను నిషేదిస్తామని కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిందని.. దానిని వెంటనే వెనక్కి తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట హనుమాన్ చాలీసా పఠనం చేయడానికి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొందరు రోడ్డుపైనే హనుమాన్ చాలీసా పఠనం చేశారు. జై శ్రీరాం.. రామలక్ష్మణ్ జానకీ..జై బోలో హనుమాన్‌కీ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ .. బజరంగ్ దళ్‌ను నిషేదిస్తామని అంటున్న కాంగ్రెస్ పార్టీ.. రేపు హనుమంతుడిని కూడా బ్యాన్ చేస్తామని చెబుతుందని విమర్శించారు. నిరసనలో పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివకుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణారెడ్డి, వేణుగోపాల్, గోనె మార్కండేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్ చిత్రంలో వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీశ్ బాబు, ఎమ్మెల్సీ రమణ తదితరులు

కరువునేల కళకళ

- గౌరవెల్లి ప్రాజెక్టు కల్పవల్లి
- హుస్నాబాద్ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు
- కొత్తపల్లి టు జనగామ స్టేట్ హైవే కోసం కృషి
- మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్



సభకు హాజరైన జనం

హుస్నాబాద్: ఒకప్పటి కరవు నేల హుస్నాబాద్ ప్రాంతం ఇప్పుడు పచ్చగా కళకళలాడుతోందని మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్‌లో డిగ్రీ కళాశాల భవనం, ఎస్టీ ఉమెన్స్ హాస్టల్, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, బస్తీ దవాఖాన, టీచర్స్ ట్రైనింగ్ సెంటర్, మున్సిపల్ దుకాణ సముదాయం, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ తదితర పనులకు మంత్రి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. అనంతరం బస్‌డిపో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభలో మాట్లాడారు. 'కేసీఆర్ కాళేశ్వరం నీళ్లను పైకి మళ్లిస్తున్న అపరభగీరథుడు. కేసీఆర్ పట్టువదలని విక్రమార్కుడు. ప్రాజెక్టులు పూర్తిచేసి గోదావరి నీళ్లను మీ పాదాల వద్దకు తెచ్చాడు' అని కొనియాడారు. కాళేశ్వరం నీళ్లు, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, మిడ్‌మానేర్ వరకు వస్తున్నాయన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టుతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కానుందన్నారు. ఆడబిడ్డల నీటి కష్టాలు తీరాయని..ఎల్లమ్మ చెరువు వద్దకు వచ్చిన ఆడబిడ్డలను నీళ్లు వస్తున్నాయా? అని అడిగితే బంజారహిల్స్‌లో ఎలాగైతే మంచినీళ్లు వస్తున్నాయో... బంజారా తండాల్లో కూడా అలాగే వస్తున్నాయని చెప్పారన్నారు. కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను భీమదేవరపల్లి మండలంలో కలిపేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. ఎంపీ బండి సంజయ్ తీరుతో కరీంనగర్ ప్రజలు సిగ్గుతో తలదించుకుంటున్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. 'మోదీ దేవుడని అంటున్నాడు. రైతుల కష్టాలు, సిలిండర్ ధర పెంచినోడు దేవుడా? ఇలాంటి పిచ్చోళ్లను పార్లమెంట్‌కు పంపితే జరిగే నష్టం ఇదే' అని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాలుగన్నరేండ్లల్లో నియోజకవర్గానికి ఏంచేశాడో చెప్పే దమ్ముందా అని కేటీఆర్ ప్రశ్నించారు. పిల్లలను రెచ్చగొట్టడం తప్ప చేసిందేమి లేదన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 1.06 లక్షల ఎకరాలకు నీళ్లు తీసుకువచ్చిన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను లక్షమెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రభుత్వంపై నిందలు వేస్తే ఊరుకోవద్దు...

ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిందలు వేస్తే ఊరుకోవద్దని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. ఇది ఎన్నికల సంవత్సరమని.. కార్యకర్తలు చురుకుగా పనిచేయాలన్నారు. అప్పులు తెచ్చి ప్రాజెక్టులు కట్టామని, దీంతో లక్షల కోట్ల ఆస్తుల విలువ పెరిగిందన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న ఛతీస్‌గఢ్‌లోధాన్యం క్వింటాల్‌కు రూ.1300 ఉంటే తెలంగాణలో క్వింటాల్‌కు రూ.2060 ధర పలుకుతుందన్నారు.

ముగ్గురు మంత్రుల అండ ఉంది..

హుస్నాబాద్‌కు ముగ్గురు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, గంగుల కమలాకర్ అండ ఉందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ శనిగరం ప్రాజెక్టుకు రూ.20 కోట్లు, సింగరాయ ప్రాజెక్టుకు రూ.5 కోట్లు విడుదల చేశారన్నారు. మిడ్‌మానేర్ ఎడమ కాల్వతో చిగురుమామిడి, సైదాపూర్ మండలాల్లో 200 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును ఎవరు అడ్డుకున్నా త్వరలో పూర్తిచేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ, హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, కరీంనగర్ జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్, సుధాకర్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీహరి, రవీందర్ రావు, భూపతిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీ లకావత్ మానస, ప్రణవ్, ఇంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు.

- ఆశీర్వాద సభకు వచ్చిన మంత్రి కేటీఆర్ పలువురితో మాట్లాడారు. మున్సిపాలిటీ శానిటేషన్ ఎలా ఉంది? జీతాలు సరిగా వస్తున్నాయా? కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అడిగారు. ఈ సందర్భంగా కొందరు మాకు జీతాలు పెంచాలని మంత్రిని కోరారు.
- మున్సిపాలిటీకి ఏడాదికి ఎంత ఆదాయం వస్తుంది? ఎంత వసూలు చేశారు? అని కమిషనర్ రాజమల్లయ్యను అడిగారు. ఏడాదికి 1.06 కోట్లు వస్తుందని ఇప్పటి వరకు 85 శాతం వసూలు చేశామని కమిషనర్ సమాధానం ఇచ్చారు.
- మున్సిపల్ పన్ను వందశాతం వసూలు చేయాలని, ప్రజాప్రతినిధులు, వాళ్లు.. వీళ్లని ఎవరి ముఖం చూడొద్దని మంత్రి సూచించారు.
- కొత్తగా ప్రారంభించిన ఇండోర్ స్టేడియంలో మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కొద్ది సేపు క్రీడాకారులతో బ్యాడ్మింటన్ ఆడారు.
- హుస్నాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. హుస్నాబాద్ పట్టణ అభివృద్ధి కోసం రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తపల్లి టూ జనగామ వరకు వెళ్లే రోడ్డును విస్తరిస్తామన్నారు.
- వేలేరు మండలంలో ఉన్న కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను భీమదేవరపల్లి మండలంలో కలపాలని సభలో కొందరు ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు.

చదువే అన్నింటికి సమాధానం

- అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి
- ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): చదువుతోనే అన్ని సాధ్యమని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ గ్రామంలో శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మతో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అందరికి సమాన హక్కు, సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు అంబేడ్కర్ విగ్రహాన్ని బుద్ధపౌర్ణమి రోజు ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విగ్రహాలు పెట్టగానే లక్ష్యం నెరవేరదని, అంబేడ్కర్ చూపిన బాటలో నడవాలని, ఆయన లక్ష్యాలు నేరవేర్చాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి అంబేడ్కర్ మీద ప్రేమ ఉంటే నూతనంగా నిర్మించే పార్లమెంటు భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో దళితబంధు పథకాన్ని చూసి అంబేడ్కర్ పుట్టిన మహారాష్ట్రలో కేసీఆర్‌కు జేజేలు కొడుతున్నారన్నారు. చిన్నకోడూర్ మండలం అల్లీపూర్ నుంచి కిష్టాపూర్ వరకు నూతనంగా రోడ్డు కోసం ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్ రెడ్డి, రాధాకృష్ణశర్మ, మండల ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అందరూ ప్రజాసేవకులే..

కొండపాక(గజ్వేల్): ఉద్యోగ, హోదాలు వేరైనా అందరూ ప్రజాసేవకులేనని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మర్పడ్గ శివారులో తేజోవనం, ఆక్సిజన్ పార్కులో హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, అడిషనల్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి వైద్యఉద్యోగులు, సిబ్బందితో వనభోజనాలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రి హాజరయ్యారు. కరోనా సమయంలో వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు ప్రాణాలకు తెగించి పనిచేశారని మంత్రి కొనియాడారు. అందరం ఒకే కుటుంబం అని చెప్పే ప్రయత్నమే ఆత్మీయ సమ్మేళనం, వన భోజనాలన్నారు. అంతకు ముందు డీఎంహెచ్‌వో కాశీనాథ్ బర్త్‌డే సందర్భంగా మంత్రి కేక్ కట్ చేశారు. హెల్త్ డైరెక్టరు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ జిల్లా అన్ని రంగాల్లో ముందు నిలవడానికి సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులే కారణమన్నారు. మహిళా ఉద్యోగులు ఆట, పాటలు, బతకమ్మ, లంబాడీ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ ర్యాగల్ల సుగుణ తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరు: అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మన భవిష్యత్ మన చేతుల్లోనే..

సిద్దిపేటజోన్: సమయాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో గొప్ప వ్యక్తులుగా ఎదగాలని, ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వీఏఆర్ గార్డెన్‌లో ప్రతిభ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన సిద్దిపేట నియోజకవర్గ ప్రగతి వీడియోను మంత్రి ఆవిష్కరించారు. ఇన్ స్పైర్, ఇగ్నైట్ సంస్థ ప్రతినిధి రంజిత్ ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం, మోటివేషన్, పర్సనాలిటీ డెవలప్మెంట్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మానాన్నలు ఆశించేది ప్రేమ మాత్రమేనని, మనం సమాజంలో గొప్పవ్యక్తిగా రాణిస్తే తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తారన్నారు. సోషల్ మీడియాను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో ఉంచే సంస్కృతి మంచిది కాదన్నారు. అంతకు ముందు తల్లిదండ్రుల జ్ఞాపకాలు గుర్తుచేసుకుని విద్యార్థులు కంటతడి పెట్టేలా చేసిన మోటివేషన్ క్లాస్ పలువురిని ఆకట్టుకుంది. అనంతరం సిద్దిపేట ప్రగతి వీడియోను మంత్రి తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, 'సుడా' మాజీ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, ఆర్టీఏ సభ్యులు ఈర్షద్, నాయకులు నాగరాజు, మహిపాల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రతిభ కాలేజీ ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.



నియోజకవర్గ ప్రగతి వీడియోను రిలీజ్ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

బిల్లులు చెల్లించకుంటే రాజీనామా

సర్పంచుల అల్టిమేటం



మిరుదొడ్డి ఎంపీడీఓ రాజిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న సర్పంచులు

మిరుదొడ్డి(దుబ్బాక): 'అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాక అప్పులపాలయ్యాం. వారం రోజుల్లో బిల్లులు ఇవ్వకపోతే మూకుమ్మడిగా రాజీనామా చేస్తాం'. అని మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలకు చెందిన సర్పంచులు స్పష్టం చేశారు. శుక్రవారం మిరుదొడ్డి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు ఆధ్వర్యంలో ఎంపీడీఓ రాజిరెడ్డికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ అప్పుచేసి గ్రామాలను అభివృద్ధి చేస్తే రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఏడాదిగా గౌరవవేతనం కూడా రావడంలేదన్నారు. వారంరోజుల్లో బిల్లుల చెల్లింపుపై ఎలాంటి స్పందన రాకుంటే సహాయ నిరాకరణ, ఆమరణ నిరాహార దీక్షతో పాటు సర్పంచుల పదవులకు మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని స్పష్టం చేశారు. నిరసనలో సర్పంచులు రంగబోయిన రాములు, సుక్క శంకర్, ఎనగంటి కిష్టయ్య, మాచపురం లక్ష్మీయాదగిరి, భారతి, పిట్ల సత్యసత్యనారాయణ, మంజుల, పన్యాల వెంకట్‌రెడ్డి, మమత, అనసూయ, మిరుదొడ్డి ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రం.. బహుబాగు



చిత్రలేఖన శిక్షణ శిబిరానికి హాజరైన చిన్నారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చిన్నారులు వేస్తున్న చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కాకతీయ ఈటెక్నో హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత చిత్రలేఖన శిబిరానికి విశేష స్పందన వస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. శిక్షణ శిబిరం ఈనెల 10తో ముగియనుంది.



వరి నేలవాలిందని చూపుతున్న ఈయన పేరు నాగరాజు. ఊరు కుకునూర్‌పల్లి మండలం రాయవరం. 15 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్న నాగరాజు రూ.5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట చేతికందే సమయంలో ధాన్యం గింజలు వర్షంపాలయ్యాయి. దీంతో ఆయన ఇటు పెట్టుబడి, అటు కౌలు డబ్బులు నష్టపోయాడు. ఇది ఒక్క నాగరాజు పరిస్థితి కాదు..జిల్లాలో వేలాదిమంది రైతుల దుస్థితి.

కౌలురైతు కుదేల్

వర్షాలతో దెబ్బతిన్న పంటలు, తోటలకు అందని పరిహారం

- పెట్టుబడి మీదపడడంతో అప్పులపాలు
- ఆదుకోవాలని వేడుకోలు

జగదేవ్‌పూర్ (గజ్వేల్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వర్షంపాలయ్యాయి. వడగండ్ల వాన కౌలు రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 3.76 లక్షల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఈదురుగాలులు, వడగండ్ల వానతో పెద్దమొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. దాదాపు 90 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. పరిహారం కోసం ఏఈఓలు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. నష్టం, రైతుల వివరాలు రికార్డు చేస్తున్నారు. కానీ..కౌలు రైతుల పేర్లు మాత్రం సేకరించడంలేదు.

40 వేలమందికి పైగానే..

జిల్లాలో మూడు లక్షల మందికిపైగా రైతులు ఉండగా, 40 వేల మందికిపైగా కౌలు రైతులు ఉన్నారు. ఎకరానికి 20 వేల నుంచి 30 వేలు ఖర్చుచేసి పంటలు సాగుచేసిన కౌలు రైతులు అకాల వర్షంతో కుదేలయ్యారు. చేతికొచ్చిన పంట నీళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతులను గుర్తించేదెవరు..

కౌలు రైతులను గుర్తించేవారు కరువయ్యారు. ఎకరానికి భూములను బట్టి పది వేల నుంచి కౌలు చెల్లిస్తున్నారు. అటు కౌలు..ఇటు పంట నష్టంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. అంతేకాదు పంటల సాగు టైంలో ఏ ప్రమాదం జరిగి మృతిచెందినా బీమా సౌకర్యమూ కల్పించడంలేదు.

50 కుటుంబాలు..

మద్దూరు(హుస్నాబాద్): అకాల వర్షాలతో చాలా మంది రైతులు నష్టపోయారు. జిల్లాలో చేర్యాల డివిజన్‌లోని మద్దూరు, దూళ్మిట్ట, కొమురవెల్లి , చేర్యాల మండలాల్లో 12 వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఇక్కడి మామిడి వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ, సిద్దిపేట తదితర ప్రాంతాలకు తరలిస్తారు. ప్రతీ సంవత్సరం వేసవికి ముందే పూత, పిందెలను అంచనావేసి మద్దూరు మండలం పిట్టలగూడెంకు చెందిన 50 కుటుంబాలకు చెందిన వారు కౌలుకు తీసుకున్నారు. ఎకరానికి రూ.80 వేల నుంచి రూ. 1.30 లక్షలు నిర్ణయించారు. ముందుగా మామిడితోట యజమానికి 50 శాతం, కాయ కోతదశలో 25 శాతం, విక్రయించిన తర్వాత రో 25 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఎకరాకు 7 నుంచి 8 టన్నుల మామిడి దిగుబడి వస్తుంది. అయితే తోటలను లీజుకు తీసుకున్న పిట్టలగూడెం వాసులు కాయలు తెప్పందుకు రెడీ అవుతుండగా వడగండ్ల వర్షం కురవడంతో కాయలన్నీ రాలిదెబ్బతిన్నాయి. తోటలను కౌలుకు తీసుకున్న పిట్టల గూడెం వాసులు నష్టపోయారు. వడ్డీలకు డబ్బులు తెచ్చి తోటల యజమానులకు చెల్లించారు. తీర వర్షం దెబ్బతీయడంతో ఆగమయ్యారు. రాలిన మామిడి విక్రయించినా కనీసం కూలి, రవాణా డబ్బులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసేదేంలేక రాలిన కాయలను పొలాల్లో పారబోస్తున్నారు.



దెబ్బతిన్న మామిడి కాయలను చేలలో పడేస్తున్న దృశ్యం

నష్టపోయాను



మామిడి తోటల కౌలు కోసం రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టాను. అకాల వర్షంతో కాయలన్నీ నేలరాలాయి. తెచ్చిన అప్పు ఎలా తీర్చాలో తెలియడంలేదు. ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి.

– తుమ్మల అశోక్, పిట్టలగూడెం

పరిహారం ఇవ్వాలి



కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించాలి. యజమానులకు డబ్బులు చెల్లించలేక.. పంట నష్టం భరించలేక అప్పుల పాలువుతున్నారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– పులిరాజు, తెలంగాణ రైతు రక్షణ సమితి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్టు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించగా, మరో ఇద్దరికి రూ. 5 వేలు జరిమానా విధించారన్నారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ప్రధాన చౌరస్తాల్లో మూడు రోజుల క్రితం తమ సిబ్బందితో కలిసి డ్రంకెన్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.9,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ



గోవిందాపూర్ ఎల్లమ్మ ఆలయ హుండీ

దుబ్బాక: దౌల్తాబాద్ మండలంలోని గోవిందాపూర్, కోనాయిపల్లి గ్రామాల్లోని ఎల్లమ్మ ఆలయాల్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. హుండీలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని డబ్బు, వస్తువులను ఎత్తుకెళ్లారు.

వ్యక్తి ఆత్మహత్య

జిన్నారం(పటాన్‌చెరు): ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. సీఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం..మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామానికి చెందిన చింతకింది సహదేవ్(36) మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు సహదేవ్ మృతదేహం వేలాడుతుండడం స్థానికులు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి ఫొటో స్టేటస్ పెట్టిన సర్పంచ్‌పై కేసు

మనోహరాబాద్(తూప్రాన్): ఓ గ్రామ సర్పంచ్.. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడి భార్య ఫొటోను వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. దీంతో పిల్లలను భర్త వద్దే వదిలేసి ఆమె తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో భర్త ఫిర్యాదు చేయగా, సర్పంచ్‌పై కేసు నమోదైంది. మండల పరిధిలోని రంగాయపల్లి గ్రామ సర్పంచ్ నాగభూషణం రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఓ యువకుడి భార్య ఫొటోను స్టేటస్‌గా పెట్టి దాని కింద ఐలవ్‌యూ అని టెక్ట్స్ కంపోజ్ చేశాడు. ఊరంతా దీనిపై చర్చ జరిగింది. దీంతో ఆమె భర్త మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 67'ఏ, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్ట ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపాడు.

ముగ్గురి ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- లారీని దాటే క్రమంలో ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో
- అక్కడికక్కడే దంపతుల మృతి
- చికిత్స పొందుతున్న కూతురు మృతి, విషమంగానే తల్లి ఆరోగ్యం
- ఏడుపాయల నుంచి తిరిగివస్తుండగా ఘటన



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాలీ ఆటో, (ఇన్‌సెట్) నాగలింగరాజు, రమ మృతదేహాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఓవర్ టేక్ ముగ్గురి ప్రాణం తీయగా, మరో ఐదుగురిని గాయాలపాలు చేసింది. దైవదర్శనం చేసుకుని సంతోషంగా తిరిగి వస్తుండగా, పెను విషాదం చోటుచేసుకుంది. ఆటోడ్రైవర్ కుటుంబం చిన్నాభిన్నమైంది. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..జీడిమెట్ల సూరారం సాయిబాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ సప్పిడి నాగలింగరాజు(36), అతని భార్య రమ(33) వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతోపాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి, అవంతిక ట్రాలీ ఆటోలో గురు వారం ఏడుపాయల వనదుర్గ ఆలయానికి వచ్చారు. రాత్రి అక్కడే ఉండి శుక్రవారం మధ్యాహ్నం తిరుగుప్రయాణం అయ్యారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహ్మద్‌నగర్‌గేట్ సమీపంలోకి రాగానే ఆటో నడుపుతున్న నాగలింగరాజు ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం చేశాడు. ఎదురుగా మెదక్ డిపోనకు చెందిన పల్లెవెలుగు బస్సు నర్సాపూర్ నుంచి మెదక్‌వైపు వస్తుండగా, ఆటో బస్సును ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ నాగలింగరాజు, అతని భార్య రమకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందారు. వీరి పిల్లలు ధరణి, వెంకటలక్ష్మి, అమృతతోపాటు పక్కింటి బత్తిని లత, ఆమె కూతుళ్లు వైశాలి, అవంతికకు కూడా గాయాలయ్యాయి. అయితే వీరిలో బత్తిని లత, ఆమె కూతురు వైశాలి పరిస్థితి విషమంగా ఉండగా, హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ వైశాలి(16) మృతిచెందింది.

జేసీబీ సాయంతో మృతదేహం వెలికితీత

ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అందులోనే ఆటో డ్రైవర్ నాగలింగరాజు మృతదేహం ఇరుక్కుపోయింది. సంఘటన స్థలాన్ని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, నర్సాపూర్ సీఐ షేక్‌లాల్ మదార్, ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి సందర్శించారు. మృతదేహాన్ని జేసీబీ సాయంతో ఆటోలో నుంచి బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

108లో బాధితుల తరలింపు

ప్రమాదం జరిగిన సమయంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, హరిచంద్‌తండా సర్పంచ్ లక్యానాయక్, రాజిపేట మాజీ సర్పంచ్ పాష ఇతర నాయకులు అటుగా వెళుతున్నారు. వెంటనే వారు గాయపడిన బాధితులను ఆటోలో నుంచి దించి 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాద వివరాలు తెలుసుకున్న సునీతారెడ్డి

అటుగా వెళుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి డీఎస్పీని అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.





వైశాలి (ఫైల్), గాయపడిన ఆమె తల్లి బత్తిని లత



ముగ్గురు కూతుళ్లతో నాగలింగరాజు, రమ(ఫైల్)

ఊరు వదల్లేక.. ఉసురు తీసుకున్నాడా..?

హుస్నాబాద్‌రూరల్: పుట్టి పెరిగిన ఊరుతో 90 ఏళ్ల అనుబంధం...కట్టుకున్న భార్య చనిపోయి 30 ఏళ్లయినా కుంగిపోలేదు. కొడుకులు, కూతురు పెళ్లి చేశాడు...ఆస్తులూ పంచి ఇచ్చాడు. పెద్దకొడుకంటే ప్రేమ ఎక్కువ. 30 ఏళ్లుగా ఆయన వద్దే ఉంటున్నాడు. మిగతా కొడుకులు పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టారు. దీంతో వారు వంతులవారీగా నెల నెలా ఒక్కో కొడుకు ఇంటివద్ద ఉండేలా తీర్పు చెప్పారు. దీంతో ఏడాదికాలంగా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మేడబోయిన వెంకటయ్య (90) కొడుకుల ఇల్లిల్లూ తిరుగుతూ ఉన్నాడు. వెంకటయ్యకు నలుగురు కొడుకులు కాగా, పెద్ద, రెండో కొడుకు సొంతూరైన పొట్లపల్లిలో ఉంటున్నారు. మూడో కొడుకు హుస్నాబాద్‌లో, నాలుగో కొడుకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని నవాబుపేటలో ఉంటున్నాడు. వంతులో భాగంగా నాలుగో కొడుకు ఉంటున్న నవాబుపేటకు వెంకటయ్య వెళ్లాల్సి ఉంది. బుధవారం పొట్లపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నవాబుపేటకు వైపునకు వెళ్లాడు. నాలుగిళ్లు తిరిగే ఈ జీవితం ఎందుకు అనుకున్నాడో ఏమో, ఉన్న ఊరు మీద మమకారం చంపుకోలేకపోయాడో.. తన మనసులో మాట కొడుకులకు చెప్పలేకపోయాడో తెలియదు కానీ తాటి కమ్మలను పోగు చేశాడు. వెంకటయ్యకు బీడీ తాగే అలవాటు ఉంది. మంట కాచుకొని అక్కడే నిద్రకు ఉపక్రమించి ప్రమాదవశాత్తు చనిపోయాడా..? జీవితంపై విరక్తి చెంది తాటి కమ్మల మంటల్లో తలపెట్టాడేమో తెలియదు కానీ గురువారం శవమై కనిపించాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం వెంకటయ్య మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. సగం కాలిన వెంకటయ్య మృతదేహాన్ని తమ వ్యవసాయ భూముల వద్ద పూర్తిగా దహనం చేసి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఏదిఏమైనా వెంకటయ్య మరణం చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కన్నీరు పెట్టిస్తోంది.



మేడబోయిన వెంకటయ్య(ఫైల్)

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

పురుగుల మందు తాగి ఒకరు... రోడ్డుప్రమాదంలో గాయపడిన మరొకరు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు.

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్ ఆంజనేయులు(30) గత నెల 30న చిన్నశంకరంపేట మండలంలోని టి.మాందాపూర్ వద్ద మరో వ్యక్తితో కలిసి స్కూటీపై వెళుతుండగా, కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులును గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మీనాకుమారి, ఇద్దరు కుమారులు చరణ్, నిషాంత్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు.



శ్రీరామ్ ఆంజనేయులు(ఫైల్)

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన రోషినిదేవేంద్ర(30) మతిస్థిమితం సరిగ్గా నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. ఆస్పత్రికి తరలిచంగా, చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న రజక సంఘం మండలాధ్యక్షుడు ఏల్లేష్ శుక్రవారం, ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. బాల్ నర్సయ్య, యాదగిరి, నర్సింలు పాల్గొన్నారు.

మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు

పటాన్‌చెరు టౌన్: మామను హత్య చేసిన కేసులో అల్లుడికి జీవిత ఖైదు పడింది. బీడీఎల్ సీఐ వినాయక రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన ఖాజామీయా కూతురు బిపాసాను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఫకీర్ అలియాస్ సత్తార్‌కి ఇచ్చి వివాహం చేశారు. సత్తార్ మద్యానికి బానిసై భార్య బిపాసాను తరచు వేధిస్తుండటంతో గత ఏడాది మార్చి నెలలో ఆమె పుట్టిల్లయిన నందిగామకు వచ్చింది. అయితే సత్తార్ కూడా అత్తగారి ఇంటికి వచ్చి అక్కడే ఉంటూ పటాన్‌చెరు మండలం కర్దనూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత ఏడాది మే 18 తేదీన సత్తార్ తన భార్య బిపాసాను కొట్టగా, ఆమె గ్రామ పెద్దలకు చెప్పేందుకు గ్రామపంచాయతీకి వెళ్లింది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న మామ ఖాజామియా(75)ను అల్లుడు సత్తార్ కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. బయటకు వెళ్లిన కూతురు ఇంటికి వచ్చి చూసేసరికి తండ్రి రక్తపు మడుగులో ఉన్నాడు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భర్తపై ఫిర్యా దు చేసింది. దర్యాప్తులో భాగంగా సత్తార్‌ను జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి ముందు హాజరుపరిచారు. శుక్రవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్‌రెడ్డి వాదోపవాదాల అనంతరం సత్తార్‌కు జీవితఖైదుతో పాటు రూ.500 జరిమానా విధించినట్టు పోలీసులు తెలిపారు. గతంలో సత్తార్‌పై రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఐదేళ్ల బాలుడి హత్య కేసులో అభియోగం మోపగా, హైకోర్టుని ఆశ్రయించాడు. దీంతో హైకోర్టు ఆ కేసును కొట్టేసింది.

ఆ పశువులు ఏమయ్యాయి?

- గోశాల లేదని ధ్రువీకరించిన కార్యదర్శి
- పోలీసులు ఎవరికి అప్పగించారు ?

సిద్దిపేటరూరల్: అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకొని గోశాలకు తరలించామని ఓ వైపు పోలీసులు చెబుతున్నారు..మరోవైపు అసలు ఆ ఊరిలో గోశాలనే లేదని గ్రామ కార్యదర్శి ధ్రువీకరిస్తున్నాడు. ఇంతకీ ఆ పశువులు ఏమయ్యాయనే దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- గత నెల 24వ తేదీన సాయంత్రం అక్రమంగా తరలిస్తుండగా, 15 పశువులను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పోలీసులు ఇర్కోడ్‌లోని శ్రీ కృష్ణసాయి గోశాలలోని కాపలాదారుడికి అప్పగించారు.
- 27వ తేదీ వరకు పశువులను మేపి రాత్రి 9 గంటల సమయంలో ఆ కాపలాదారుడు ఇంటికి వచ్చాడు.
- మరునాడు ఉదయం గోశాల వద్దకు వెళ్లిచూడగా..అవి కనిపించలేదు. దీంతో పశువులను దొంగిలించాడని ఓ వ్యక్తిని అనుమానిస్తూ 28వ తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కాపలాదారుడు నాగరాజు ఫిర్యాదు చేశాడు.
- ఇదిలా ఉండగా మే 1వ తేదీన ఇర్కోడ్‌లోని గోశాలలో ఉన్న 15 పశువులు అనారోగ్యంతో ఉన్నాయని, వాటికి వైద్యం చేయాలంటూ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ తోర్నాల పశువైద్యాధికారి చందనకు నోటీసు ద్వారా తెలిపారు.
- మే 2వ తేదీన కాపలాదారుడు పశువులను బుస్సాపూర్‌లోని స్కూల్‌లో మేపుతుండగా వాటిని పరీక్షించి డాక్టర్ చందన వైద్యం చేశారు.

ఆ పశువులు బలహీనంగా ఉన్నాయి.

ఈ విషయమైన చందనను సాక్షి వివరణ కోరగా.. పోలీస్‌స్టేషన్ నుంచి సమాచారం వచ్చిన మరుసటి రోజే బుస్సాపూర్ వెళ్లాను. అప్పటికే పశువులు డీహైడ్రేషన్‌కు గురయ్యాయి. చాలా బలహీనంగా ఉన్నాయి. వాటికి వైద్యం చేసి వచ్చాను. 4వ తేదీన రాత్రి ఒక ఆవు చనిపోయినట్టు సమాచారం అందిందని' ఆమె చెప్పింది.

ఇర్కోడ్‌లో గోశాల లేదు..

ఇర్కోడ్‌లో శ్రీకృష్ణ సాయి గోశాల లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి జీవన్‌రెడ్డి ధ్రువీకరించారు. అసలు పోలీసులు ఇర్కోడ్‌లో లేని గోశాల ఎలా పశువులను అందించారు? ఈ కాపలాదారుడు ఎవరు? అసలు పశువులకు బదులు, అక్కడ బలహీనమైన పశువులు ఎలా వచ్చాయి? అన్న ప్రశ్నలపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

నాగరాజుకు అప్పగించాం

గత నెల 24వ తేదీన పట్టుకున్న పశువులను బుస్సాపూర్ గ్రామానికి చెందిన సోము నాగరాజుకు చెందిన తాత్కాలిక గోశాలలో అప్పగించాం. ఆ తర్వాత అతనే పశువులను అమ్ముకున్నాడని తెలిసింది. ఈవిషయం బయటకు రాగానే అమ్మిన వ్యక్తి కొన్న వ్యక్తితో కలిసి అసలు వాటికి బదులు వేరే పశువులను తీసు కొచ్చాడు. దీనికి నాగరాజే కారణమని బజరంగ్‌దళ్ చెందిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగరాజు వివరాలు సేకరిస్తున్నాం. దోషులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

– భానుప్రకాశ్, త్రీటౌన్ సీఐ

వేర్వేరు ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): కౌడిపల్లి మండలం ధనూజతండాకు చెందిన సునావత్ గన్యా జోగిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. చిలప్‌చెడ్ మండలం చిట్కుల్ వద్ద మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపై డాకూర్‌కు చెందిన అనిల్ కారులో వేగంగా వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గన్యాకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జోగిపేట ఆస్పత్రికి తరలించారు.



గాయపడిన గన్యా

శివ్వంపేట(నర్సాపూర్): ధాన్యం కుప్పను ఢీకొట్టిన ఘటనలో ఒకరు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ మండలం జండాపల్లికి చెందిన నాగరాజుయాదవ్ బైక్‌పై వెళుతున్నాడు. తూప్రాన్- వెల్దుర్తి ప్రధాన రోడ్డుపై దంతన్‌పల్లి వద్ద ధాన్యం కల్లాలు ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి సమయంలో ధా న్యం కుప్పలుగా చేసి రోడ్డుపై ఉంచారు. కుప్ప ను ఢీకొని బైక్ అదుపు తప్పడంతో నాగరాజు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు.

దొంగ రిమాండ్

మెదక్ మున్సిపాలిటీ: మహిళ మెడలోంచి పుస్తెలతాడు దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు పట్టణ సీఐ సంజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నశంకరంపేట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన పడాల కౌసల్య మెదక్ ఎంసీహెచ్ ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఈ క్రమంలో మాసాయిపేట వెంకటరాములు శుక్రవారం తెల్లవారు జామున 6గంటల ప్రాంతంలో కౌసల్య మెడలోంచి పుస్తెలతాడు దొంగతనం చేయగా, అతడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి మూడున్నర తులాల బంగారం రికవరీ చేశారు.

సీసీ ఫుటేజీ చెక్ చేసి... నగదు ఉన్న బ్యాగ్ అప్పగించి

నారాయణఖేడ్: పట్టణంలో ఓ మహిళ రూ.40వేల నగదుతోపాటు ఇతర వస్తువులు ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. సీసీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు బ్యాగును గుర్తించి బాధితురాలికి అప్పగించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బైరాన్‌దిబ్బ గ్రామానికి చెందిన మడపతి సంగీత తన తల్లిగారి గ్రామమైన న్యాల్‌కల్ మండలం హుమ్నాపూర్ వెళ్లేందుకు శుక్రవారం నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్‌లో బస్సు దిగింది. ఓ చోట బ్యాగును పక్కనపెట్టి కూర్చుంది. కొద్దిసేపటి తర్వాత చూస్తే బ్యాగు కనిపించలేదు. అందులో రూ.40వేల నగదుతోపాటు చీరలు, ఇతర వస్తువులు ఉండడంతో ఆమె ఆందోళనకు గురైంది. అక్కడ పెట్రోలింగ్ విధులు నిర్వర్తిస్తున్న పోలీసులకు బ్యాగు పోయిన విషయాన్ని చెప్పింది. వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీసీఫుటేజీని పరిశీలించగా ఆమె బ్యాగు పెట్టిన చోటకు కొంత దూరంలో బ్యాగు పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో ఉన్న నగదు, ఇతర వివరాలు బాధితురాలు సరిగ్గానే చెపపడంతో బ్యాగు ఆమెదిగానే నిర్ధారించుకుని బ్యాగుతోపాటు అందులోని నగదును ఎస్‌ఐ అందజేశారు.



నారాయణఖేడ్: సంగీతకు పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

ట్రాలీ ఆటోను ఢీకొన్న ఇన్నోవా

పదిమంది కూలీలకు గాయాలు

తూప్రాన్: ట్రాలీ ఆటోను ఇన్నోవా ఢీకొన్న ఘటనలో 10 మంది కూలీలకు గాయపడ్డారు. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యావపూర్ గ్రామానికి చెందిన మహిళలు మనోహరాబాద్ మండలంపాలాట గ్రామంలోని ఓ సీడ్ పరిశ్రమలో కూలీలుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా పని ముగించుకొని ట్రాలీ ఆటోలో ఇంటికి వస్తున్నారు. వీరి ఆటో 44వ జాతీయ రహదారిపై కరీంగూడ చౌరస్తా వద్ద రహదారిపై మలుపు తిరుగుతున్న సమయంలో నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న ఇన్నోవా అతివేగంగా వచ్చి ట్రాలీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో యావపూర్ గ్రామానికి చెందిన 10 మంది మహిళ కూలీలకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో అనురాధ, రేణుక, వరలక్ష్మి, పద్మ, చాంద్‌బీ, పుష్ప, మీన, మమత, ఫారినాబేగం, బాలమణి ఉన్నారు. కాగా నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఇన్నోవాపై ప్రభుత్వ వాహనం అని రాసి ఉంది. అయితే ఇన్నోవాలోని ఎయిర్ బ్యాగ్‌లు తెరుచుకోవడంతో ప్రాణనష్టం తప్పింది. అందులో నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులు ఉన్నట్టు సమాచారం. వారు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని పోలీసులు మరో వాహనంలో హైదరాబాద్ పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా ఇదే



ఘటనా స్థలంలో గాయపడి రోదిస్తున్న మహిళా కూలీలు



క్షతగాత్రులకు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

సరిహద్దులో రెండంచెల తనిఖీలు

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఎక్సైజ్ సిబ్బంది, పోలీసుల తనిఖీలు

జహీరాబాద్: కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో ఇరు రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాయి. దీంతో రెండంచెల తనిఖీలు జరుగుతున్నాయి. చెక్‌పోస్టులను ఎప్పటికప్పుడు ఆయా శాఖల ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే సంగారెడ్డి ఎస్పీ రమణ్‌సింగ్ ఆయా చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. కర్ణాటక పోలీసు ఉన్నతాధికారులతో సైతం సమావేశమై చేపట్టాల్సిన చర్యలు, నిఘా విషయమై చర్చించారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరికిషన్ కూడా తనిఖీ చేశారు. కర్ణాటక పరిధిలోని చెక్‌పోస్టులను బీదర్ ఎస్పీ చెన్న బసవన్న, కలెక్టర్ గోవింద్‌రెడ్డిలు తనిఖీ చేస్తున్నారు. దీంతో చెక్‌పోస్టుల వద్ద భద్రత కట్టుదిట్టంగా సాగుతోంది. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వదిలి పెడుతున్నారు. తెలంగాణ నుంచి కర్ణాటకలోకి అక్రమంగా మద్యం, డబ్బు తరలకుండా నిఘా ఉంచారు.

రాష్ట్ర సరిహద్దుల్లో 13 చోట్ల చెక్‌పోస్టులు

రాష్ట్ర సరిహద్దుల్లోని 13 చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని చిరాగ్‌పల్లి, మాడ్గి, మనియార్‌పల్లి, గౌసాబాద్, బూచనెల్లి, మాడ్గి, హుస్సేనగర్, డప్పూర్, కల్బేమల్, శాపూర్ జంక్షన్, డేగుల్‌వాడి, కసర్‌గుత్తి, హూసెల్లి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాయి. అక్రమంగా మద్యం తరలకుండా ఎక్సైజ్ పోలీసులు, అక్రమంగా డబ్బు తరలకుండా పోలీసు శాఖలు గట్టి నిఘా పెట్టాయి. కర్ణాటక పరిధిలో సైతం ఆయా శాఖల అధికారులు ప్రత్యేకంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. 65వ జాతీయ రహదారిపై బొంగూరు వద్ద ప్రధాన చెక్‌పోస్టు ఏర్పాటు చేసి నిఘా ఉంచాయి. చెక్‌పోస్టుల వద్ద రాత్రింబవళ్లు తనిఖీలు నిర్వహించిన అనంతరమే వాహనాలను లోపలకు వెళ్లేందుకు అనుమతిస్తున్నారు.



65వ నంబరు జాతీయ రహదారి చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



బీదర్ రహదారిపై ఉన్న చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ రమణకుమార్(ఫైల్)